



# మన దునియా

Our News Our World

RNI Number TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం







సంపుటి : 3 | సంచిక : 269 | మే 27 బుధవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


# శవాలపై పేలాలు ఏరుకునే రాజకీయం!

## బాధ కంటే... 'కెమెరా యాంగిల్' ముఖ్యం !




**మన దునియా,హైదరాబాద్:డెస్క్ మే 26**

ఒకరి ఇంట్లో చావు జరిగితే, పరామర్శించడానికి వెళ్ళే నాయకుడి మనసులో నిజమైన సానుభూతి ఉండాలి. కానీ, ఈ కాలపు 'హైటెక్' నాయకులు శవయాత్రకు వెళ్ళే ముందే తమ సోషల్ మీడియా టీమ్‌ను, కెమెరామెన్‌లను సిద్ధం చేసుకుంటున్నారు.

స్క్రిప్ట్ ప్రకారం కన్నీళ్లు: శవం ముందుకు వెళ్ళగానే కెమెరా లైట్లు ఆన్ అవుతాయి. నాయకుడు బాధపడుతున్నట్టు ముఖం పెడతాడు. ఆ 'సరిగ్గా సరిపోయే' బాధను కెమెరాలో బంధించే వరకు సదరు నాయకుడు అక్కడే నిలబడతాడు.

రీల్స్ – పోస్టుల హడావిడి : అంత్యక్రియలు పూర్తి కాకముందే... సదరు నాయకుడి అధికారిక సోషల్ మీడియా ఖాతాలలో "ఫలానా వారి అంత్యక్రియల్లో పాల్గొని అశ్రునయనాలతో నివాళులు అర్పించిన జననేత" అంటూ స్లో–మోషన్ వీడియోలు, ఎమోషనల్ మ్యూజిక్‌తో కూడిన రీల్స్ ప్రత్యక్షమవుతాయి.

ఓట్ల లెక్కలు : ఈ శవయాత్రకు వెళ్లడం వల్ల ఆయా సామాజిక వర్గం ఓట్లు మనకు పడతాయా? రాబోయే ఎన్నికల్లో దీనివల్ల మైలేజ్ వస్తుందా? అనే లెక్కలతోనే ఆ పాడెను మోస్తారు. ఎక్కువ లబ్ది పొందుతాము అనుకుంటే ఎక్కువ సేపు పాడే మోస్తారు తక్కువ లబ్ది పొందుతామనుకుంటే ఫోటో ఫోజు ఇచ్చి పోతారు

**దీనికంటే నీచమైనది ఇంకేముంటుంది ?**

హిందూ సంప్రదాయంలో గానీ, మరే ఇతర సంస్కృతిలోనైనా మరణాన్ని గౌరవించడం నేర్పుతారు. శ్మశాన వైరాగ్యం అనేది మనిషిలో అహంకారాన్ని చంపేయాలి. కానీ, ఇక్కడ అహంకారం, స్వార్థం మరింత పెరిగిపోతున్నాయి."బ్రతికున్నప్పుడు మనిషికి సాయం చేయకపోయినా పర్వాలేదు, కానీ చనిపోయిన తర్వాత అతని శవాన్ని, ఆ కుటుంబం పడే గుండెకోతను తమ రాజకీయ ఎదుగుదలకు పెట్టుబడిగా మార్చుకోవడం కంటే 'నీచమైన సమయం' లేదా 'నికృష్ణమైన ఆలోచన' మరొకటి ఉండదు."ఇది కేవలం మానవత్వాన్ని ఖూనీ చేయడమే కాదు, ప్రకృతి నియమాలను కూడా అపహాస్యం చేయడమే.

(మిగతా 2వ పేజీలో..)

మరణం... మనిషి జీవితంలో అత్యంత నిశ్శబ్దమైన, పవిత్రమైన ఘట్టం.

అక్కడ కులమతాలు, హోదాలు, వైషమ్యాలు అన్నీ కరిగిపోతాయి.

శ్మశానానికి వెళ్ళిన ప్రతి ఒక్కరి మనసులోనూ వైరాగ్యం తోటి మనిషిని కోల్పోయామనే 'బాధ' మాత్రమే మిగులుతాయి

కానీ దురదృష్టవశాత్తూ నేటి కొందరు రాజకీయ నాయకులకు మాత్రం శ్మశానం కూడా ఒక ఎన్నికల ప్రచార వేదిక'లాగే కనిపిస్తోంది.

# పంచాయతీ సిబ్బందికి తీపి కబురు చెప్పిన రేవంత్ సర్కారు

రాష్ట్రంలోని 50 వేల మంది పంచాయతీ సిబ్బందికి ఒకటో తారీఖునే జీతాలు

జీతాల కోసం ప్రతినెలా రూ. 50 కోట్ల ప్రత్యేక నిధుల విడుదల

గ్రామ పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పిస్తూ కీలక నిర్ణయం

పోస్టల్ విధానం రద్దు.. ఇకపై పెన్షన్లు నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి జమ

అర్హులైన వారికి కొత్త పెన్షన్ల మంజూరుకు మొదటి ప్రాధాన్యత

రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలంగాణ ప్రభుత్వం తీపికబురు అందించింది.



(మిగతా 2వ పేజీలో..)

# తెలంగాణ గవర్నర్ ను కలిసిన కవిత... రేవంత్ సర్కారుపై ఫిర్యాదు

భూసేకరణ బాధితుల సమస్యలపై గవర్నర్‌ను కలిసిన కవిత

ఖమ్మం, పరిగి, ఆర్ఆర్ఆర్ బాధితుల సమస్యలను వివరించిన కవిత

రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు

బాధితులకు న్యాయం జరగకపోతే మళ్లీ ఉద్యమిస్తామని హెచ్చరిక



(మిగతా 2వ పేజీలో..)


# పోక్సో కేసు: బండి భగీరథ్‌కు 3 రోజుల పోలీస్ కస్టడీ

పోక్సో కేసులో బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌కు మూడు రోజుల పోలీసు కస్టడీ

ఏడు రోజుల కస్టడీ కోరిన పోలీసులు..

మూడు రోజులకే అనుమతించిన మల్కాజ్‌గిరి కోర్టు

ప్రస్తుతం చర్లపల్లి జైలులో ఉన్న భగీరథ్‌ను విచారించనున్న పోలీసులు



కస్టడీని వ్యతిరేకించిన భగీరథ్ తరపు న్యాయవాది

మే 16న భగీరథ్‌ను

(మిగతా 2వ పేజీలో..)

# ప్రధాని మోదీకి తమిళనాడు సీఎం విజయ్ లేఖ.. ఏం కోరారంటే?

కావేరీ నదిపై కొత్త వివాదం

కర్ణాటక డ్యామ్ ప్రతిపాదనకు తమిళనాడు వ్యతిరేకత

మేకేదాటు ప్రాజెక్టును నిలిపివేయాలని డిమాండ్

త్వరలోనే ఢిల్లీ వెళ్లనున్న సీఎం విజయ్

దిగువ రాష్ట్రాల అనుమతి తప్పనిసరని వ్యాఖ్య

కావేరీ నది నీటి పంపకాల వివాదం మళ్లీ రాజుకుంది. కర్ణాటక కొత్త డ్యామ్ పనులకు సిద్ధమవడంతో తమిళనాడు అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ప్రాజెక్టును ఆపాలని కోరుతూ ప్రధానమంత్రికి తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ అత్యవసర లేఖ రాశారు.మేకెదాటు దగ్గర కర్ణాటక ప్రభుత్వం డ్యామ్ నిర్మించాలని

(మిగతా 2వ పేజీలో..)



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## తెలంగాణ గవర్నర్ ను కలిసిన కవిత... రేవంత్ సర్కారుపై ఫిర్యాదు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వ భూసేకరణ కారణంగా నిరాశ్రయులైన బాధితులకు న్యాయం చేయాలని తెలంగాణ రక్షణ సమితి (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కె. కవిత గవర్నర్‌ను కోరారు. మంగళవారం ఆమె ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్, పలువురు బాధితులతో కలిసి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్‌భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఒక వినతిపత్రం సమర్పించారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఇళ్లు కూల్చివేతకు గురైన బాధితులందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని, పరిగి మండలం కడ్లాపూర్‌లో ఇండస్ట్రియల్ పార్క్ కోసం జారీ చేసిన భూసేకరణ నోటీసును రద్దు చేయాలని వారు గవర్నర్‌ను కోరారు. అలాగే, రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్ మార్పు, ఇతర భూసేకరణ సమస్యలను కూడా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. గవర్నర్‌తో భేటీ అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మహిళల ఇళ్లను కూల్చివేస్తున్నారని, రేవంత్ రెడ్డి ఒక నిర్దయుడైన ముఖ్యమంత్రి అని, కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గమైన పాలన అందిస్తోందని ఆమె విమర్శించారు. వంద రూపాయల చీరలు పంచి బాధితులను లక్షాధికారులను చేశానని సీఎం అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. తమ పోరాటాల ఫలితంగా వెలుగుమట్ల బాధితులకు అదే స్థలంలో భూమి కేటాయించడానికి ప్రభుత్వం అంగీకరించిందని, పరిగి, ఆర్ఆర్ఆర్ భూసేకరణ ప్రక్రియలను నిలిపివేసిందని కవిత తెలిపారు. ఇవి పాక్షిక విజయాలని, సంపూర్ణ న్యాయం కోసం కేంద్రం ప్రమేయం అవసరమని, అందుకే గవర్నర్‌ను కలిశామన్నారు. గవర్నర్ సానుకూలంగా స్పందించారని, అన్ని అంశాలపై నివేదిక తెప్పించుకుని న్యాయం చేస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. బాధితులకు న్యాయం జరగని పక్షంలో మరోసారి ఉద్యమబాట పడతామని ఆమె హెచ్చరించారు.

## పోక్సో కేసు: బండి భగీరథ్‌కు 3 రోజుల పోలీస్ కస్టడీ

(మొదటి పేజీ తరువాయి)

అరెస్ట్ చేసిన పోలీసులు

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్‌కు పోక్సో కేసుకు సంబంధించి మల్కాజ్‌గిరి కోర్టు మూడు రోజుల పోలీసు కస్టడీ విధించింది. ఈ మేరకు మంగళవారం ప్రాసిక్యూషన్ పిటిషన్‌పై న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. విచారణ కోసం భగీరథ్‌ను వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరగా, కోర్టు మూడు రోజులకు మాత్రమే అనుమతించింది. దీంతో ప్రస్తుతం చర్లపల్లి జైలులో ఉన్న భగీరథ్‌ను పేట్‌బషీరాబాద్ పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. అంతకుముందు, పోలీసు కస్టడీ పిటిషన్‌ను భగీరథ్ తరపు న్యాయవాది కరుణాసాగర్ వ్యతిరేకించారు. ఒకవేళ కస్టడీకి అనుమతిస్తే ఉదయం 10 నుంచి సాయంత్రం 5:30 గంటల మధ్య మాత్రమే విచారణ జరపాలని, విచారణకు ముందు, తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించాలని కోరారు. విచారణ సమయంలో బలవంతపు పద్ధతులు వాడకుండా పోలీసులను ఆదేశించాలని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణలపై మే 8న భగీరథ్‌పై పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. బాధితురాలి వాంగ్మూలం తర్వాత పోలీసులు కేసులో కఠినమైన సెక్షన్లను జోడించారు. మే 16న హైకోర్టులో మధ్యంతర రక్షణ లభించకపోవడంతో పోలీసులు భగీరథ్‌ను అరెస్ట్ చేశారు. అయితే, తన కుమారుడు పోలీసుల ఎదుట లొంగిపోయాడని బండి సంజయ్ తెలిపారు. నేరం అంగీకరించిన తర్వాతే అరెస్ట్ చేశామని పోలీసులు పేర్కొన్నారు. అనంతరం కోర్టు అతనికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.

## ప్రధాని మోదీకి తమిళనాడు సీఎం విజయ్ లేఖ.. ఏం కోరారంటే?

(మొదటి పేజీ తరువాయి)

చూస్తోంది. ఈ ప్రతిపాదనను తిరస్కరించాలని సీఎం విజయ్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. కర్ణాటక అక్కడ భూమి పూజకు ఏర్పాట్లు చేస్తోందని లేఖలో పేర్కొన్నారు. కావేరీ నీటి వివాద ట్రైబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను కర్ణాటక ఉల్లంఘిస్తోందని విజయ్ ఆరోపించారు. ఈ ఆదేశాలను గతంలో సుప్రీంకోర్టు కూడా సమర్థించిందని తెలిపారు. ఎగువన ఉన్న రాష్ట్రాలు దిగువ రాష్ట్రాల అనుమతి లేకుండా కొత్తగా ఎలాంటి జలాశయాలు నిర్మించొద్దని పేర్కొన్నారు. తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల అంగీకారం కర్ణాటకకు తప్పనిసరని వివరించారు. ట్రైబ్యునల్ అనుమతించిన ప్రాజెక్టుల జాబితాలో మేకెదాటు లేదని సీఎం విజయ్ పేర్కొన్నారు. కావేరీ బేసిన్‌లో ఇప్పటికే నీటి కొరత ఉందని లేఖలో రాశారు. ఉన్న నీటిని ఇప్పటికే అన్ని రాష్ట్రాలకు కేటాయించారని తెలిపారు. ఇప్పుడు కొత్తగా భారీ జలాశయం నిర్మించడం సుప్రీంకోర్టు తీర్పును ధిక్కరించడమే అవుతుందని హెచ్చరించారు. కాగా, త్వరలోనే విజయ్ ఢిల్లీ వెళ్లి ప్రధానిని కలిసే అవకాశం ఉంది.



# పంచాయతీ సిబ్బందికి తీపి కబురు చెప్పిన రేవంత్ సర్కారు

(మొదటి పేజీ తరువాయి)

సుమారు 50 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెలా ఒకటో తారీఖునే జీతాలు చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఐఏఎస్ అధికారులకు సమయానికి జీతాలు అందినట్లే, క్షేత్రస్థాయిలో పనిచేసే పంచాయతీ సిబ్బందికీ వేతనాలు అందాలని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించి, పలు కీలక సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాల చెల్లింపులో జాప్యం జరగకుండా, ప్రభుత్వం నుంచి ప్రతినెలా రూ.50 కోట్లను ప్రత్యేకంగా విడుదల చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. కేవలం పంచాయతీ సిబ్బందికే కాకుండా, ప్రభుత్వంలోని అన్ని శాఖల పరిధిలోని అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ నెల మొదటి రోజే జీతాలు అందేలా చూడాలని తేల్చిచెప్పారు. సిబ్బంది జీతాల చెల్లింపులో ఒక్కరోజు ఆలస్యమైనా సహించేది లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీ ఖాతాలో జమ చేయాలన్న నిబంధనను రద్దు చేయాలని ఆదేశించారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018లోని సెక్షన్ 70(3)కి సవరణలు చేసి, పంచాయతీల సొంత ఆదాయాన్ని ప్రభుత్వ ట్రెజరీకి బదులుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇది పంచాయతీల ఆర్థిక స్వేచ్ఛను పునరుద్ధరించడానికి దోహదపడుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. పెన్షన్ల పంపిణీ విధానంలోనూ మార్పులు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న పెన్షన్లను ఇకపై నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని చెప్పారు. ఈ విధానం ద్వారా పారదర్శకత పెరుగుతుందని, అనర్హులను ఏరివేయడం సులభమవుతుందని తెలిపారు. ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్, సామాజిక-ఆర్థిక కుల గణన (ఎస్ఈసీసీ) డేటాను ఉపయోగించి పెన్షన్ల క్రమబద్ధీకరణ చేపట్టాలన్నారు. అర్హులైన వారికి కొత్త పెన్షన్లు మంజూరు చేయడానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# శవాలపై పేలాలు ఏరుకునే రాజకీయం !

**ఓటరు మారాలి... అప్పుడే వీరు మారుతారు !**

ఇలాంటి నాయకులకు బుద్ధి రావాలంటే కేవలం విమర్శిస్తే సరిపోదు. ప్రజల్లో, ముఖ్యంగా ఓటర్లలో మార్పు రావాలి. చనిపోయిన వారి ఇళ్ల వద్దకు వచ్చి ఫొటోలకు ఫోజులిచ్చే నాయకులను చూసి "ఆహా! మా నాయకుడు ఎంత గొప్పవాడో, చావుకు కూడా వచ్చాడు" అని మురిసిపోవడం మానేయాలి. ఎవరైతే చావులను కూడా తమ పబ్లిసిటీ కోసం వాడుకుంటారో, వారిని అసహ్యించుకోవడం మొదలుపెట్టాలి. ఎన్నికల సమయంలో ఓటు వేసేటప్పుడు ఇలాంటి శవ రాజకీయాలు చేసేవారిని పక్కన పెట్టాలి. రాజకీయం అంటే అధికారం కోసం ప్రాకులాడటం మాత్రమే కాదు... సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండటం. శవాల మీద పేలాలు ఏరుకునే ఈ సంస్కృతికి స్వస్తి పలకకపోతే, సమాజంలో 'మానవత్వం' అనే పదానికి అర్థమే లేకుండా పోతుంది. ఇప్పటికైనా ఇటువంటి నాయకులు తమ స్వార్థ రాజకీయాలను పక్కన పెట్టి, మరణాన్ని, అవతలి వారి బాధను గౌరవించడం నేర్చుకోవాలి.

# ప్రధాని మోదీతో కేరళ నూతన సీఎం సతీశన్ తొలి భేటీ

**రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సాయం కోరుతూ వినతిపత్రం**

**ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇదే తొలి సమావేశం**

**కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అమిత్ షాతోనూ భేటీకి ప్రణాళిక**

**కేంద్రంతో సత్సంబంధాల దిశగా యూడీఎఫ్ సర్కార్ తొలి అడుగు**



కేరళ నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వి.డి. సతీశన్ నేడు ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో తొలిసారి సమావేశమయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి ఘన విజయం సాధించిన తర్వాత కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలు నెలకొల్పుకునే దిశగా ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ప్రధాని కార్యాలయంలో సుమారు 20 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరుతూ సీఎం సతీశన్.. ప్రధానికి ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సమావేశంలో కేరళ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ. జయతిలక్ కూడా పాల్గొన్నారు. దశాబ్ద కాలం పాటు అధికారంలో ఉన్న పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్‌ను ఓడించి యూడీఎఫ్ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే ఈ భేటీ జరగడం రాజకీయంగా ఆసక్తి రేపింది. మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక సహాయం, పెండింగ్‌లో ఉన్న రైల్వే, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వంటి అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. అయితే, భేటీ అనంతరం బయటకు వచ్చిన సతీశన్.. చర్చల వివరాలను వెల్లడించలేదు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఢిల్లీ వచ్చిన ఆయన, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, హోంమంత్రి అమిత్ షా, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌లతో కూడా సమావేశం కానున్నారు.

# మా కుమార్తె కేసులో న్యాయం చేయండి.. జగన్‌ను వేడుకున్న సుగాలి ప్రీతి తల్లిదండ్రులు!

**2017లో హత్యాచారానికి గురైన సుగాలి ప్రీతి**

**తమకు న్యాయం జరగలేదన్న ప్రీతి తల్లిదండ్రులు**

**కేసును పక్కన పెట్టేశారని ఆవేదన**

**అండగా ఉంటామని భరోసా ఇచ్చిన జగన్**

గత తొమ్మిదేళ్లుగా తమ కుమార్తె కేసులో న్యాయం కోసం పోరాడుతున్న సుగాలి ప్రీతి తల్లిదండ్రులు పార్వతి, రాజు నాయక్‌లు వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ ను కలిసి తమ ఆవేదనను పంచుకున్నారు. 2017లో తమ కుమార్తెపై అత్యంత దారుణంగా అత్యాచారం చేసి, హత్య చేశారని.. ఇన్నేళ్లు గడుస్తున్నా తమకు ఇంకా న్యాయం జరగలేదని వారు జగన్ ఎదుట కన్నీరు పెట్టుకున్నారు. ఆనాడు వైసీపీ ప్రభుత్వం తమ కుటుంబానికి కర్నూలులో 5 సెంట్ల ఇంటి స్థలం, 5 ఎకరాల వ్యవసాయ భూమితో పాటు ప్రీతి తండ్రికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అండగా నిలిచిందని చెప్పారు. అయితే, ప్రస్తుతం ఈ కేసును పూర్తిగా పక్కనపెట్టేశారని ఆరోపించారు. అంతేకాకుండా, తమకు రావాల్సిన పెన్షన్‌ను కూడా స్థానిక అధికారులు నిలిపివేశారని, కేటాయించిన స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు సాయం అడిగినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జగన్ దృష్టికి తీసుకెళ్లారు. సీబీఐ విచారణ వేగవంతమయ్యేలా తమకు న్యాయ సహాయం అందించాలని వారు కోరారు. బాధిత తల్లిదండ్రుల గోడును సావధానంగా విన్న జగన్, సుగాలి ప్రీతి కుటుంబానికి అన్ని విధాలా న్యాయ సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ తరపున లీగల్ సపోర్ట్ ఇస్తామని, భవిష్యత్తులోనూ ఆ కుటుంబానికి వైసీపీ అండగా ఉంటుందని జగన్ భరోసా కల్పించారు.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం
మే । బుధవారం । 27 । 2026


# దొంగల ముఠా..ఏటీఎంను ధ్వంసం!







**మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఘటన...**

**మన దునియా,మహబూబ్‌నగర్: మే 26**

మహబూబ్‌నగర్ నడిబొడ్డున తెల్లవారుజామున కొందరు గుర్తుతెలియని దొంగల ముఠా ఎటిఎంను ధ్వంసం చేసింది. షాద్ నగర్ లో ఏటీఎం పగలగొట్టిన ముఠాపైనే పోలీసులు అనుమానాలు! మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం తెల్లవారుజామున దొంగల ముఠా ఏటీఎంను ధ్వంసం చేసి నగదును దోచుకు వెళ్లారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంను ధ్వంసం చేసే ఉద్దేశంతో ముందుగా సమీపంలో ఉన్న సీసీ కెమెరాలు, తదితరాలను దొంగలు ధ్వంసం చేశారు. అనంతరం ఏటీఎంను పగలగొట్టి అందులో ఉన్న నగదును దోచుకెళ్ళారు. ఉదయం విషయం బహిర్గతం కావడంతో సంబంధిత బ్యాంకు అధికారులు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. షాద్ నగర్ లో ఏటీఎంను పగలగొట్టి దొంగతనానికి పాల్పడిన ముఠానేగా పోలీసుల అనుమానం! ఇటీవల షాద్ నగర్ లో ఏటీఎం ను పగలగొట్టి దొంగతనానికి పాల్పడిన ముఠాయే ఈ పని చేసి ఉండవచ్చు అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు క్లూస్ టీం సహకారంతో వివరాలు సేకరిస్తున్నారు. జిల్లా కేంద్రం నడిగడ్డన సంఘటన జరగడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

# కూలుతున్న సిద్దిపేట కోమటిరెడ్డి కెనాల్

**కాగితాలకే పరిమితమైన రిపేర్ల ప్రతిపాదనలు**

**గతేడాది కెనాల్ నీరు బయటకు వచ్చి నీటమునిగిన పరిసర ప్రాంతాలు**


**వర్షాకాలం సమీపిస్తుండటంతో స్థానికుల్లో ఆందోళన**

**మన దునియా,సిద్దిపేట:మే 26**

సిద్దిపేట పట్టణంలోని కోమటి చెరువు కెనాల్ రోజురోజుకు కూలుతోంది. కొంత కాలంగా దీన్ని పట్టించుకోకపోవడంతో కోమటి చెరువు నుంచి నర్సాపూర్ చెరువుకు వెళ్లే మార్గంలో కెనాల్ గోడలు పలు చోట్ల కూలిపోగా, కెనాల్ బెడ్ కూడా కుంగింది. గతేడాది వచ్చిన వరదతో కోమటి చెరువు కెనాల్ ధ్వంసం కాగా రిపేర్ చేయలేదు. దీంతో రోజురోజుకు మరింత కూలుతోంది. వర్షాకాలం సమీపిస్తుండగా కెనాల్ రిపేర్ ప్రతిపాదనల్లోనే ఉండడంతో వరదలకు మరింత ధ్వంసం అవుతుందని ఆందోళన కలిగిస్తోంది.

కోమటిచెరువు మత్తడి మీదుగా కెనాల్

రెండు దశాబ్దాల క్రితం కోమటి చెరువు మత్తడి మీదుగా నర్సాపూర్ చెరువులోకి నీరు వెళ్లేందుకు కెనాల్ నిర్మించారు. ఎన్సాన్‌పల్లి రోడ్డు నుంచి హైదరాబాద్ రోడ్డులోని బావిస్‌ఖాన్ పూల్ దాటిన తర్వాత కొంత మేర మరో కెనాల్‌ను నిర్మించారు. ఈ కాలువ ద్వారా కోమటి చెరువు మత్తడి నుంచి వచ్చే నీళ్లు సులభంగా నర్సాపూర్ చెరువుకు చేరుతున్నాయి. దాదాపు 30 ఫీట్ల వెడల్పు, 12 ఫీట్ల లోతుతో తడకపల్లి, ఎన్సాన్ పల్లి నుంచి వచ్చే వరద కోమటి చెరువులోకి చేరి మత్తడి మీదుగా నర్సాపూర్ చెరువులోకి వెళ్లేలా దీనిని నిర్మించారు.కొంత కాలంగా కోమటి చెరువు కెనాల్‌కు రిపేర్లు చేయకపోవడంతో పలు చోట్ల డ్యామేజ్ అవుతున్నాయి. గతేడాది సెప్టెంబర్‌లో వచ్చిన వరదలతో ఈ కెనాల్ తీవ్రంగా దెబ్బతింది. ఎన్సాన్‌పల్లి రోడ్డు నుంచి




500 మీటర్ల వరకు కెనాల్ సైడ్ వాల్స్ కూలిపోగా బెడ్ సైతం దెబ్బతింది. కెనాల్ సిల్ట్‌ను తొలగించకపోవడంతో వరద బయటకు రావడంతో గోడలు దెబ్బతినడమే కాకుండా ప్రమాదకరంగా తయారైంది.

నిధుల కోసం ప్రతిపాదనలు

కోమటి చెరువు కెనాల్ భరత్‌నగర్, శ్రీనగర్ కాలనీ, టీచర్స్ కాలనీల సమీపంలో తీవ్రంగా దెబ్బతినడంతో రిపేర్లకు ఇరిగేషన్ శాఖ ఇప్పటికే రూ.3కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ నిధులు మంజూరైతే కెనాల్ రిపేర్లు పూర్తయి, వరద ముప్పు ఉండదని స్థానికులు భావిస్తున్నారు. మరోవైపు దెబ్బతిన్న కెనాల్‌లో మురుగు పేరుకుపోతుండడంతో దుర్గంధంతో పాటు దోమలు తీవ్రంగా వ్యాపిస్తున్నాయి. కొంతకాలంగా గుర్రపు డెక్కతో నిండిపోవడంతో నీరు నిలచి ఇబ్బందులు కలిగిస్తోంది. దీనివల్ల వచ్చే వర్షాకాలంలో నీరు ముందుకు కదలక కాలనీల్లోకి ప్రవేశించే అవకాశాలు ఉన్నాయి. గతేడాది ఎదురైన పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# పిసిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎనిమిదో వారానికి చేరుకున్న మజ్జిగ పంపిణీ కార్యక్రమం





**ఖానాపూర్ ఆర్సి మన దునియా మే;26.**

మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే వారసంతలో పిసిఆర్ (పూర్ణచంద్రరావు) ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న మజ్జిగ పంపిణీ కార్యక్రమం నేటితో ఎనిమిదో వారానికి చేరుకుంది. మండుతున్న ఎండల నేపథ్యంలో వారసంతకు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఫౌండేషన్ సభ్యులు స్వచ్ఛందంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిసిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముడుగు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలకు చల్లదనాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రతి మంగళవారం ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. వేసవికాలం పూర్తయ్యే వరకు వారసంతకు వచ్చే ప్రజలకు మజ్జిగ అందజేస్తామని చెప్పారు. ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని, సామాజిక సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిలువేరి నరసయ్య, గోపి సత్యనారాయణ, నోముల రాజకుమార్, దేవయ్య, చకినాల భూమేష్, రాజేష్ తదితరులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# మండలంలో అందరి మన్ననలు పొందుతున్న ఎస్ ఐ కస్తాల గోపికృష్ణ

**పెన్ పహాడ్, మే 26 మన దునియా ప్రతినిధి**



సమర్థతకు మారుపేరుగా, విధి నిర్వహణలో సింహస్వప్నంగా నిలుస్తూ పెన్ పహాడ్ మండలంలో శాంతిభద్రతలను సరికొత్త వ్యూహంతో నడిపిస్తున్నారు సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) కస్తాల గోపికృష్ణ. కేవలం శాంతిభద్రతలను కాపాడటమే కాకుండా, సామాజిక రుగ్మతలపై ఉక్కుపాదం మోపుతూ ఆయన చేస్తున్న కృషిపై మండల ప్రజలు, ఉన్నతాధికారుల నుండి ప్రశంసల జల్లు కురుస్తోంది.గంజాయి, గుడుంబా రహితంగా మార్పు యువత భవిష్యత్తును చిన్నాభిన్నం చేస్తున్న గంజాయి మహమ్మారిపై ఎస్సై కస్తాల గోపికృష్ణ మొదటి నుంచీ పటిష్టమైన చర్యలు చేపట్టారు. మండలంలో గంజాయి జాడ లేకుండా కఠినమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారు. దశాబ్దాలుగా తండా గ్రామాలలో వేధిస్తున్న గుడుంబా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ, దాడులు నిర్వహించి పెన్ పహాడ్‌ను ‘గుడుంబా రహిత మండలం’గా తీర్చిదిద్దారు. నేరాల నియంత్రణే ధ్యేయంగా ప్రధాన గ్రామాలలో స్వయంగా చొరవ తీసుకుని సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేసి రక్షణ కవచంగా నిలిచారు.తన వ్యూహాలతో కేసుల ఛేదన.. ఇటీవల మండల కేంద్రంలో జరిగిన ఒక భారీ బంగారం చోరీ కేసును ఎస్సై గోపికృష్ణ అత్యంత వేగంగా, చాకచక్యంగా ఛేదించారు. దొంగలను పట్టుకోవడమే కాకుండా, లూటీ అయిన ప్రతి గ్రాము బంగారాన్ని రికవరీ చేసి బాధితులకు అప్పగించి పోలీసుల పట్ల నమ్మకాన్ని పెంచారు. అలాగే, ఒక మైనర్ బాలికపై జరిగిన అఘాయిత్యం కేసులో నిందితుడికి కఠిన శిక్ష పడేలా పక్కా శాస్త్రీయ ఆధారాలను సేకరించి తన వృత్తి నైపుణ్యాన్ని చాటారు. ఈ అద్భుతమైన పనితీరుకు గాను జిల్లా ఎస్పీ గారి చేతుల మీదుగా ప్రత్యేక ప్రశంసలు అందుకోవడం విశేషం.

శాంతియుత వాతావరణంలో ఎన్నికలు..

ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో ఎస్సై గోపికృష్ణ చూపిన వ్యూహాత్మక చొరవ అభినందనీయం. మండల పరిధిలోని 29 గ్రామ పంచాయతీలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించి శాంతిభద్రతలను కాపాడారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి పిటిషన్‌పై త్వరితగతిన స్పందిస్తూ, బాధితులకు తక్షణ న్యాయం అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. విధి నిర్వహణలో కఠినంగా ఉంటూనే, ప్రజల పట్ల స్నేహపూర్వక బంధం కలిగిన పోలీస్ గా సేవలు అందిస్తున్న కస్తాల గోపికృష్ణ నిజమైన ప్రజా రక్షకుడిగా నిలిచారు.

# భువనగిరిలో ఘనంగా తెలంగాణ గానకోకిల బెల్లి లలితక్క వర్ధంతి ..

**లలితక్క చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించిన టీఆర్పీ రాష్ట్ర నాయకులు..**

**లలితక్క ఆశయ సాధనతోనే బీసీ రాజ్యాధికారం సాధ్యమన్న తెలంగాణ రాజ్యాధికార పార్టీ.!**

**మన దునియా,భువనగిరి జిల్లా: మే 26**

భువనగిరి జిల్లా: తెలంగాణ తొలిదశ ఉద్యమ గర్జన, సబ్బండ వర్గాల సాంస్కృతిక సారథి, అమరవీరురాలు బెల్లి లలిత (తెలంగాణ గానకోకిల) వర్ధంతి సందర్భంగా భువనగిరి జిల్లా కేంద్రంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించిన రాష్ట్ర నాయకత్వం .పట్టణంలోని లలితక్క చిత్రపటానికి పూలమాలలు వేసి, అమరవీరులకు స్మరిస్తూ జై తెలంగాణ నినాదాలతో హోరెత్తించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ మాట్లాడుతూ.. పాలక వర్గాల గుండెలు అదిరిపోయేలా నిప్పులు చెరిగారు.ఒక బెల్లి లలిత గొంతు కోస్తే తెలంగాణ పాట ఆగిపోతుందని భ్రమపడ్డ నాటి అరాచక పాలకులు, హంతక ముఠాలు ఇవాళ కాలగర్భంలో కలిసిపోయాయి. కానీ లలితక్క పాడిన ప్రతి అక్షరం ఇవాళ కోట్ల మంది బహుజనుల గుండెల్లో విప్లవ జ్వాలగా ఎగసిపడుతోంది. ఆమె శరీరాన్ని 17 ముక్కలు చేసినా, ఆ ముక్కల నుండి వేలాది మంది ఉద్యమకారులు పుట్టుకొచ్చారు. తెలంగాణ తెచ్చుకున్నా బడుగు, బలహీన వర్గాలకు ఒరిగింది ఏమీ లేదు. లలితక్క కలలుగన్న సామాజిక తెలంగాణ, సబ్బండ వర్గాల రాజ్యాధికారం సాధించే వరకు మా తెలంగాణ రాజ్యాధికార పార్టీ విశ్రమించదు. ద్రోహుల గుండెల్లో నిద్రపోతాం అన్నారు. అనంతరం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వనజ పటేల్ మాట్లాడుతూ.. లలితక్కను చంపిన శక్తులపై తీవ్రస్థాయిలో మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదు బెల్లి లలిత కేవలం ఒక గాయని కాదు, అణగారిన వర్గాల ఆయుధం. భువనగిరి ఫ్లోరైడ్ రక్కసిపై, భూస్వాముల అరాచకాలపై గర్జించిన వీరనారి. ఒక బహుజన మహిళ ప్రశ్నించే స్థాయికి ఎదిగితే ఓర్వలేక పాశవికంగా హతమార్చారు. లలితక్కను భౌతికంగా చంపినా, ఆమె ఇచ్చిన పోరాట స్ఫూర్తిని చంపలేరు. ఇవాళ తెలంగాణలో మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై, హక్కుల కోసం లలితక్క స్ఫూర్తితో మహిళా లోకం తిరగబడాలి. నాడు లలితక్కను పొట్టనబెట్టుకున్న శక్తులకు, నేటి అరాచక పాలకులకు బీసీ మహిళల చేతిలో దిమ్మతిరిగే రోజులు దగ్గరపడ్డాయి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజని కుమార్ యాదవ్, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బందారపు నర్సయ్య గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్లబోయిన ఓదెలు యాదవ్, మరియు రాష్ట్ర నాయకులు, మహిళా నాయకురాలు, వివిధ అనుబంధాల సంఘాల నాయకులు జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వడ్డేపల్లి మండల సర్వేయర్

**మన దునియా,ధర్మఘంట గద్వాల మే 26):**



భూములకు సంబంధించి ఒక రైతుకు అనుకూలంగా సర్వే చేయడానికి లంచం డిమాండ్ చేసిన గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల సర్వేయర్ బ్రహ్మయ్య మంగళవారం ఏసీబీ అధికారుల దాడిలో అడ్డంగా బుక్కయ్యారు.రూ. 20,000 డిమాండ్..మండలంలోని ఒక రైతుకు సంబంధించిన మొత్తం నాలుగు ఎకరాల పొలాన్ని సర్వే చేయడానికి ఎకరాకు రూ. 5,000 చొప్పున మొత్తం రూ. 20,000 ఇవ్వాలని సర్వేయర్ బ్రహ్మయ్య సదరు రైతుపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. ఇందులో భాగంగా రైతు నుంచి గతంలోనే అడ్వాన్సుగా రూ. 5,000లు తీసుకున్నారు. మిగిలిన పూర్తి డబ్బులు ఇస్తేనే పొలం సర్వే చేస్తానని, లేదంటే కుదరదని సర్వేయర్ మొండికేయడంతో విసిగిపోయిన బాధిత రైతు మహబూబ్ నగర్ అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మహబూబ్ నగర్ ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ సారధ్యంలో ఏసీబీ బృందం పక్కా ప్రణాళికతో వడ్డేపల్లిలో నిఘా పెట్టింది. రైతు నుంచి సర్వేయర్ బ్రహ్మయ్య రూ. 10,000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి రసాయన పరీక్షలతో సహా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం సొమ్మును స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ బాలకృష్ణ తెలిపారు.

# కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి అభినందనలు తెలిపిన నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి

**మన దునియా,ఢిల్లీ:మే 26**



ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గ సభ్యుల పనితీరుపై కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి సోమనాథ్ ప్రకటించిన మంత్రుల పనితీరు, ఫైల్స్ క్లియర్ చేయడం, అభివృద్ధి ర్యాంకుల జాబితాలో కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి దేశంలోనే అగ్రస్థానంలో నిలవడం అభినందనీయమని నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు.ఢిల్లీలో వారి నివాసంలో జి కిషన్ రెడ్డిను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సేవలో కిషన్ రెడ్డి చూపుతున్న నిబద్ధత, నిజాయితీ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో సమర్థత, ప్రజలతో నిరంతర అనుసంధానం వల్లే ఈ గుర్తింపు లభించిందని అన్నారు. దేశవ్యాప్తంగా ఉత్తమ ర్యాంకు సాధించిన మంత్రుల జాబితాలో తొలి వరుసలో నిలవడం తెలుగు ప్రజలకు గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా కిషన్ రెడ్డి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ వారికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు..

# జగిత్యాల జిల్లా ఎస్‌జీఓ కమిషనర్‌గా పేరం మహేందర్ నియామకం

**ఖానాపూర్ ఆర్సీ మన దునియా మే;26.**



మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కామన్‌పల్లి గ్రామానికి చెందిన పేరం మహేందర్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆర్గనైజేషన్ (ఎస్‌జీఓ) జగిత్యాల జిల్లా కమిషనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు నేషనల్ కమిషనర్ ఆఫ్ ఇండియా సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.ఆయన నియామకానికి సంబంధించిన వివరాలను రాష్ట్ర కమిషనర్ అశోక్ రాజ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లాలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సేవాభావం పెంపొందించేందుకు పేరం మహేందర్ సమర్థవంతంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్న పేరం మహేందర్‌కు ఈ బాధ్యతలు రావడం పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, యువజన సంఘాల నాయకులు మరియు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పేరం మహేందర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన జాతీయ, రాష్ట్ర కమిటీలకు కృతజ్ఞతలు తెలిపారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ అభివృద్ధికి కృషి చేస్తూ విద్యార్థుల్లో సేవా దృక్పథం, క్రమశిక్షణ, దేశభక్తి భావాలను పెంపొందించేందుకు అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు.

# అంగన్వాడి భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి







**సంగెం మన దునియా మే 26**

మంగళవారం సంగెం మండలం గుంటూరుపల్లి గ్రామంలో మహిళా శక్తి వారోత్సవాల సందర్భంగా అంగన్వాడి భవనాన్ని జిల్లా కలెక్టర్ శ్రీమతి సత్య శారద గారితో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ...గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, బాలల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు.అంగన్వాడి కేంద్రాలు చిన్నారుల విద్యాభివృద్ధికి, గర్భిణీలు మరియు బాలింతల ఆరోగ్య పరిరక్షణకు ఎంతో కీలకమని తెలిపారు. ప్రీ ప్రైమరీ స్కూల్ లు ఏర్పాటు చేయబోతున్నామని, డైట్ చార్జెస్ పెంపు, అత్యాధునిక విద్యా ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.మహిళల సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.పిల్లలకు పోషకాహారం, ప్రాథమిక విద్య, ఆరోగ్య సేవలు అందించే దిశగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.

# ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పం







**సంగెం మన దునియా మే 26**

మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందనిమహిళా శక్తి వారోత్సవాలలో భాగంగా మహిళా సమైక్య భవనం లకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సంగెం మండలంలోని గవిచర్ల రైతు వేదికలో మహిళా శక్తి వారోత్సవాల సందర్భంగా గవిచర్ల, తీగరాజు పల్లి, సోమ్లా తండా, పెద్ద తండా గ్రామాలలో నిర్మించనున్న మహిళా సమైక్య భవనం లకు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అంతకముందు రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని,కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళా సంఘాల వ్యవస్థ ప్రారంభమైనదని, దేశం రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మహిళల ద్వారా సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలోని మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడం లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేసిందన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు పరిమితిని రూ 5 లక్షల నుండి 10 వరకు పెంచి, బ్యాంకు రుణాల వడ్డీని ప్రభుత్వమే భరిస్తుంది అన్నారు. మహిళలకు ఉచితబస్ ప్రయాణం, పెట్రోల్ బంకులు,సోలార్ విద్యుత్ ఉత్పత్తి, రైస్ మిల్లులు, మహిళా శక్తి సూపర్ బజార్లు, మహిళా ఉత్పత్తుల మార్కెటింగ్కు అనుగుణంగా ఆధునిక వసతులతో గ్రామ మహిళా భవనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.సంగెం మండల మహిళా సమైక్యకు బస్సు కొనుగోలు ద్వారా నెలకు దాదాపు 65 వేల ఆదాయం వస్తుందని అన్నారు. పరకాల మహిళా డైరీ ఏర్పాటు మహిళలపై పూర్తి నమ్మకంతో ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి మహిళా భాగస్వామ్యం కావాలని కోరారు.రేవంత్ అన్న నాయకత్వంలో మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో శంకుస్థాపనలు మేమే చేస్తాం, ప్రారంభోత్సవాలు మేమే చేస్తాం అని అన్నారు.ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని, గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని అన్నారు.మహిళల ఆర్థిక స్వావలంబన, సామాజిక అభివృద్ధికి తోడ్పడే మహిళా సమైక్య భవనాలు ఉపయోగపడతాయన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

మే । బుధవారం । 27 । 2026



# హుజూరాబాద్ డంప్ యార్డ్ రద్దుపై వెంటనే స్పష్టమైన ప్రకటన చేయాలి

**సీడీఎంఏ శ్రీదేవిని కలిసి వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

**మన దునియా హుజూరాబాద్ నియోజకవర్గం**

హుజూరాబాద్ నియోజకవర్గంలోని సిర్సపల్లి గ్రామంలో ప్రతిపాదిత డంప్ యార్డ్ ఏర్పాటును వెంటనే రద్దు చేస్తూ ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో సీడీఎంఏ శ్రీదేవిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, డంప్ యార్డ్ రద్దు కోసం హుజూరాబాద్ ప్రాంత ప్రజలు, జేఏసీ నాయకులు, వివిధ ప్రజాసంఘాలు గత కొంతకాలంగా ఆందోళనలు, నిరసనలు, నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు స్పష్టమైన హామీ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే విధంగా డంప్ యార్డ్ ఏర్పాటుకు ప్రయత్నించడం పూర్తిగా ప్రజా వ్యతిరేక చర్య అని విమర్శించారు. డంప్ యార్డ్ కారణంగా పరిసర గ్రామాల్లో గాలి, నీరు, భూమి కాలుష్యానికి గురయ్యే ప్రమాదం ఉందని, చెత్త నుంచి వెలువడే విషపూరిత వాయువులు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు శ్వాసకోశ సమస్యలు, చర్మవ్యాధులు, అంటువ్యాధులు, క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులకు గురయ్యే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ భూములు పాడైపోవడంతో పాటు భూగర్భ జలాలు కలుషితమై రైతులు తీవ్ర నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, భవిష్యత్తు, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని వెంటనే డంప్ యార్డ్ నిర్ణయాన్ని రద్దు చేసి, ప్రజలకు ఇబ్బందులు కలగని ప్రత్యామ్నాయ ప్రదేశాన్ని గుర్తించాలని సీడీఎంఏ అధికారులను కోరారు. ప్రభుత్వం వెంటనే స్పష్టమైన ప్రకటన చేయకపోతే హుజూరాబాద్ ప్రజలతో కలిసి మరింత ఉద్ధృతమైన ఉద్యమానికి సిద్ధమవుతానని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హెచ్చరించారు.




# లొంగిపోయిన మావోయిస్టు దంపతులు.. చెక్కులు అందజేసిన డీజీపీ

**మన దునియా,హైదరాబాద్,మే 26**

మావోయిస్టు పార్టీలో నాలుగున్నర దశాబ్దాల పాటు పసునూరి నరహరి అలియాస్ సంతోష్ పని చేశారని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో మీడియా ఎదుట నరహరితోపాటు ఆయన భార్య ధనమ్మను తెలంగాణ పోలీసులు ప్రవేశపెట్టారు. లొంగిపోయిన వారిద్దరికి రూ. 25 లక్షలు, రూ. 20 లక్షలు చొప్పున డీజీపీ చెక్కులు అందజేశారు. అనంతరం డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 47 మంది మావోయిస్టులు ఇంకా అజ్ఞాతంలో ఉన్నట్లు గుర్తించామన్నారు. అందులో తెలంగాణాకి చెందిన వారు ముగ్గురు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఒకరు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు 15, జార్ఖండ్ 13, ఒడిశాకు చెందిన 15 మంది ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని వివరించారు. 2024 నుండి ఇప్పటి వరకు 822 మంది మావోయిస్టులు లొంగిపోయారని పేర్కొన్నారు. మొత్తం 334 ఆయుధాలతో వీరంతా తెలంగాణా పోలీసులు ఎదుట లొంగిపోయారని చెప్పారు. ఇక తెలంగాణా పోలీసులు ముందు లొంగిపోయిన ఒడిశాకి చెందిన మావోయిస్టులను ఆ రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించామని పేర్కొన్నారు. మన రాష్ట్రానికి చెందిన మావోయిస్టులను త్వరలో వారి ప్రాంతాలకు వెళ్లి స్వయంగా కలుస్తానని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. తెలంగాణాకు చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు ముప్పాళ్ల లక్షణరావు అలియాస్ గణపతితోపాటు జాడే రత్న బాయి అలియాస్ సుజాత, వార్త శేఖర్ అలియాస్ మంగు లొంగిపోవాలని ఈ సందర్భంగా వారికి డీజీపీ సీవీ ఆనంద్ విజ్ఞప్తి చేశారు. మీరు లొంగిపోతే ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని బెనిఫిట్స్‌తోపాటు సదుపాయాలు కల్పిస్తామని అజ్ఞాతంతో ఉన్న మావోయిస్టులకు డీజీపీ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. మే 12వ తేదీన పోలీసుల ఎదుట నరహరి, ఆయన భార్య లొంగిపోయారు. వారిని ఈ రోజు మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. 2026, మార్చి 31వ తేదీ నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం ఆపరేషన్ కగార్ చేపట్టింది. ఈ సందర్భంగా వందల సంఖ్యలో మావోయిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. అలాగే పలువురు మావోయిస్టులను అరెస్ట్ చేశారు. మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు నిరంతరాయంగా చేపట్టిన కూంబింగ్ కారణంగా భారీ సంఖ్యలో మావోయిస్టులు మరణించారు. ఇక ప్రభుత్వం ఎదుట లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం ప్రకటించిన రివార్డులు అందజేశారు. దీంతో దేశంలో దాదాపుగా మావోయిస్టు పార్టీ ప్రాబల్యం దాదాపుగా తగ్గిపోయింది..




# దగ్ధమైన తాటివనాన్ని పరిశీలించిన మాలజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్





**గీత కార్మికులు, రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి**

**మన దునియా ప్రతినిధి కమలాపూర్**

కమలాపూర్ మండల కేంద్రంలో ఇటీవల అగ్నిప్రమాదానికి గురై పూర్తిగా దగ్ధమైన తాటివనాన్ని మల్కాజ్గిరి ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటెల రాజేందర్, మంగళవారం పరిశీలించారు. ఘటన స్థలాన్ని సందర్శించి బాధిత రైతులు, గీత కార్మికులతో మాట్లాడి నష్ట వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ పంటల వద్ద జరుగుతున్న అగ్నిప్రమాదాలతో అనేక అనర్థాలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంతో గీత కార్మికులు ఉపాధి కోల్పోయారని, రైతుల వైర్లు, మోటార్లు, పైపులు, చేతికొచ్చిన ధాన్యం పూర్తిగా దగ్ధమై భారీ నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత రైతులు, గీత కార్మికులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## శనిగరంలో సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

**ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ సహకారంతో బాధితుడికి ఆర్థిక సాయం**

**మన దునియా ప్రతినిధి కమలాపూర్**



హుజురాబాద్ నియోజకవర్గంలోని కమలాపూర్ మండలం శనిగరం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకున్న బాధితుడికి ముఖ్యమంత్రి సహాయనిధి,సీఎం ఆర్ ఐ నుంచి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా మాదాసి సాంబయ్యకు రూ. 35 వేల విలువైన చెక్కును అందజేశారు. ఎంఎల్సీ, టీపీసీసీ ఉపాధ్యక్షులు మరియు ప్రభుత్వ విప్ ఆధ్వర్యంలో ఈ చెక్కు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రస్తుత పరిస్థితుల్లో సాయుధ పోరాటం కష్టం: లొంగిపోయిన మావోయిస్టు నరహరి

**మన దునియా,హైదరాబాద్,మే 26**





ప్రస్తుత పరిస్థితుల్లో మావోయిస్టులు చేపట్టిన సాయుధ పోరాటం కష్టంగా మారిందని ఆ పార్టీ కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు పసునూరి నరహరి వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లో మాజీ మావోయిస్టులు నరహరితోపాటు ఆయన భార్య ధనమ్మను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ సమక్షంలో మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా లొంగిపోయిన నరహరి మీడియాతో మాట్లాడుతూ.. జార్ఖండ్, తెలంగాణతోపాటు మిగతా ప్రాంతాల్లో సాయుధ పోరాటం పరంగా అనేక నష్టాలు చేశామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం కల్పించిన అవకాశాలు కారణంగానే తాము ప్రజా జీవితంలోకి వచ్చామని స్పష్టం చేశారు. జార్ఖండ్‌లోని మావోయిస్టు పొలిట్ బ్యూరో సభ్యుడు మిసిరి బిశ్రా అనుమతితోనే తాము ప్రజా జీవితంలోకి వచ్చామని తెలిపారు. తెలంగాణ ప్రజల హక్కుల సాధన చట్టపరంగానే జరగాలని భావిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. లొంగిపోయిన మావోయిస్టులకు తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయలు, సాయుధ పోరాటంలో చోటు చేసుకున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రజా జీవితంలోకి రావాలని మావోయిస్టు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణరావును నరహరి కోరారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డితోపాటు డీజీపీ సీవీ ఆనంద్‌కు పసునూరి నరహరి కృతజ్ఞతలు తెలిపారు. మే 12వ తేదీన తెలంగాణ పోలీసులు ఎదుట మావోయిస్టులు నరహరితోపాటు ధనమ్మ లొంగిపోయారు. వీరిని మంగళవారం మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా వారికి ప్రభుత్వం తరఫున వారికి డీజీపీ నగదు చెక్కులను అందజేశారు. అజ్ఞాతంలో ఉన్న 47 మంది మావోయిస్టులు కూడా లొంగి పోవాలని ఈ సందర్భంగా డీజీపీ పిలుపునిచ్చారు..

## జూన్ 1 చెరుకూరు నుండి ధర్మారం రోడ్డు దిగ్బంధం సిపిఎం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు

**మన దునియా ,వాజేడు ,మే 26**

చెరుకూరు నుండి ధర్మారం రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఫారెస్ట్ అడ్డంకులు తొలగించాలని సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో జూన్ 1న సోమవారం నాడు రోడ్డు దిగ్బంధనం చేపట్టడం జరుగుతుందని దీనిని జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు మాట్లాడుతూ అన్నారు ఈ రోజు గుమ్మడి దొడ్డి గ్రామంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో రఘుపతిరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కర్రే గుట్టలకు ఇచ్చే శ్రద్ధ కూడా ప్రజా రవాణా కోసం ప్రజలకు ఇవ్వడం లేదని ప్రమాదాలు జరిగిన ప్రజలు ఆస్పటల్ బారిన పడుతున్న ఈ ప్రభుత్వాలకు చలనం లేదని ఏజెన్సీ ప్రాంతంలో గోదావరి ఇసుకను ప్రభుత్వం అడ్డగోలుగా అమ్ముకొని రోడ్లు ధ్వంసం చేసి పట్టించుకోని పాపాన పోలేదని రోడ్డు నిర్మాణం కోసం ప్రజలు ఆందోళన చేస్తే నిధులు మంజూరు చేసిన ఫారెస్ట్ అనుమతి ఇవ్వటం లేదని రోడ్డు వెడల్పు చేస్తే బొంత పొదలు తప్ప పోయేది ఏమీ లేనప్పటికీ భారీ చెట్లు పోతున్నట్లు ఫారెస్ట్ అధికారులు అడ్డంకు పెడుతున్నారని కర్రెగుట్టలకు లేని అడ్డంకులు ప్రజారావాణలకు ఎందుకు వారు మాట్లాడుతున్నారు అని అన్నారు ఫారెస్ట్ చైర్మన్ ఈ జిల్లా వాసి ఈ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అయి ఉండి కూడా ఫారెస్ట్ అధికారులతో ఎందుకు చర్చించడం లేదని ఈ జిల్లా మంత్రి సీతక్క ఈ జిల్లా చెందినవారైనా మరియు ఎంపీ ఈ నియోజకవర్గ ప్రజల బాగోగులను ఎందుకు పట్టించుకుంటలేరని వారు మాట్లాడుతూ అన్నారు పేరూరు చింతూరు, ధర్మవరం అయ్యవారిపేట చెరుకూరు గ్రామపంచాయతీలు గ్రామసభలలో రోడ్డు సమస్యలపై ఎందుకు తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపడం లేదని వారు మాట్లాడుతూ అన్నారు ప్రజలతో ఓట్లు వేసుకుని గెలిచిన సర్పంచులు ప్రజాసమస్యలు పట్టవా అని మాట్లాడుతూ విమర్శించారు గత అనేక మార్లు రోడ్డు సమస్యపై అధికారులకు ప్రభుత్వానికి విన్నవించుకున్న ఫలితం లేకపోవడం ఈ ఆందోళనకు పిలుపునిచ్చామని జూన్ 1న చెరుకూరు నుండి ధర్మవరం రోడ్డు పూర్తిగా మూసివేసి ఆందోళన చేస్తామని ఆ పరిధిలోని గ్రామాల ప్రజలకు ఆ ఒక్కరోజు ఈ పోరాటానికి సహకరించాలని వారు మాట్లాడుతూ అన్నారు ఈ సమావేశంలో బచ్చల కృష్ణబాబు అధ్యక్షతనంగా జరగగా నాయకులు జజ్జరి దామోదర్ తోలేం ముత్తయ్య గౌరారపు చంద్రశేఖర్ తల్లడి ఉదయ్ పాయం కుమారి ప్రవీణ్ పూణేం కృష్ణ బాబు బలుసు పార్టీ నరేష్ తదితరులు పాల్గొన్నారు



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

# ప్రతి వినియోగదారుడు ప్రశ్నించాలి..?

**వినియోగదారునికి చట్టం ద్వారా లభించిన ముఖ్యమైన హక్కు..**

**కన్స్యూమర్ యాక్ట్ కమిషన్ సభ్యులు దిడ్డి గోపాల్...**




**మన దునియా,షాద్ నగర్:మే 26**

ప్రతి వినియోగదారుడు వస్తువులు, సేవలు పొందినప్పుడు వాటి నాణ్యత, ధర, ఇతరత్ర లోపాలపై ప్రశ్నించే హక్కు కలిగి ఉంటారు... ఇది వినియోగదారునికి చట్టం ద్వారా లభించిన ముఖ్యమైన హక్కు.

సరియైన సమాచారం, నాణ్యమైన ఉత్పత్తులు మోసాలకు వ్యతిరేకంగా పరిహారం పొందే హక్కును ప్రతి ఒక్కరు బాధ్యతగా తెలుసుకోవాలి...ప్రతి వినియోగదారుడు ప్రశ్నించాలి. అని కన్స్యూమర్ కమిషన్ యాక్ట్ సభ్యులు డి. గోపాల్ గుర్తు?చేశారు.

అంగట్లో కొనే ప్రతి వస్తువు.. నీ కష్టర్జితమే...

అంగట్లో కొనే ప్రతి వస్తువుకూ,నీ చెమటోర్చి సంపాదించిన డబ్బులను వ్యాపారుల మాయాజాలనికి మోసపోవొద్దు..అది నీ హక్కు అని.. నిరూపించుకోవడానికి వచ్చే ప్రతి చిన్న సందేహాన్ని ప్రశ్నించు! అదే నీ హక్కు అని గుర్తుంచాలకోవాలని అయన పేర్కొన్నారు.పేరు గొప్పగా ఉన్నాయని మోసపోకు,నాణ్యత లేని వస్తువులకు బానిస కాకు!వస్తువు లోపించినా, మోసం ఎదురైనా,చట్టం ఇచ్చిన హక్కుతో నిలదీసి ప్రశ్నించు!ప్రతి వినియోగదారుని చైతన్యమే మన బలం,అవగాహనతో కూడిన ప్రశ్నే మనకు రక్ష! మోసాలకు తావివ్వకండి, అన్యాయాన్ని సహించకండి.. ప్రతి వినియోగదారుడు నిత్యం ప్రశ్నించాలి... అదే మన అందరి నిజమైన బాధ్యత, హక్కు అని తెలిపారు. అలాగే మనందరిలో చైతన్యం రావాలని అయన పిలుపు నిచ్చారు.ప్రతి వినియోగదారుడు ప్రశ్నించే తత్త్వం అలవర్చుకోవాలని కన్స్యూమర్ యాక్ట్ కమిషన్ సభ్యులు దిడ్డి గోపాల్ సూచించారు.

డేట్ అయిపోయింది.. అడిగితే ఊ.. ఆఆ..!!

షాద్ నగర్ సూపర్ మార్కెట్లో ఎక్స్పైర్ అయిన స్వీట్ ఆయిల్ టిన్నులను ఎమార్పి రేట్ల కంటే అధిక రెట్లకు అమ్మకం జరిగుతుందని కన్స్యూమర్ యాక్ట్ సభ్యులు దిడ్డి గోపాల్ అన్నారు. అలాగే దీనిపై బిల్ ఆధారంగా మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లి అడిగితే సరియైన స్పందన లేకపోవడంతో పాటు దురుసు సమాధానం వినియోగదారుడికి ఇవ్వడం జరిగినదని ఆరోపించారు .. దీంతో కన్స్యూమర్ కమిషన్ యాక్ట్ క్రింద కేస్ ఫైల్ చేయడం జరిగిందని వివరించారు.. కన్స్యూమర్ కు ప్రశ్నించే తత్వం నేర్చుకోవాలని, ఎక్సపర్ డేట్లను,ఎమ్మార్పీని చూసి కొనాలని సూచించారు. ఆరోగ్యరీత్యా ప్రతి నిత్యావసర వస్తువుల కొనుగోలును జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు..అలాగే ప్రాడక్ట్ ట్రేడ్ మార్క్.. నాణ్యతలను చూసుకోవడం కన్స్యూమర్ భాధ్యత అని అన్నారు. డిస్కౌంట్ లపేరుతో మాయాజాలం అని.. అలాంటి వాటినని నమ్మకండి అని వివరించారు.

## చీజ్ ఆరోగ్యానికి ఎంత మంచిదంటే..?

చీజ్ తో తయారు చేసే ఆహార పదార్థాలు ఎంతో రుచిగా ఉంటాయి. ఇంకా అలాగే చీజ్ కూడా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. చీజ్ ను తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం చాలా ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఈ చీజ్ ను మితంగా తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. చీజ్ లో క్యాల్షియం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది ఎముకలను ధృడంగా ఇంకా ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. చీజ్ ను తీసుకోవడం వల్ల ఎముకలు గుల్లబారడం ఇంకా ఎముకల పగుళ్లు వంటి సమస్యలు రాకుండా ఉంటాయి.చీజ్ లో ప్రోటీన్ అనేది ఎక్కువగా ఉంటుంది. కండరాలను ఆరోగ్యంగా ఉంచడంలో, దేహ పుష్టికి ప్రోటీన్ అనేది ఎంతో సహాయపడుతుంది. అంతేకాకుండా చీజ్ లో విటమిన్ బి12, విటమిన్ ఎ, ఫాస్పరస్ ఇంకా జింక్ వంటి ఎన్నో పోషకాలు ఉన్నాయి. ఇవి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడంలో, శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో ఇలా చాలా రకాలుగా సహాయపడతాయి. అలాగే బరువు తగ్గడంలో కూడా చీజ్ మనకు సహాయపడుతుంది. ఈ చీజ్ లో క్యాలరీలు, ప్రోటీన్, కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉన్నప్పటికి దీనిని కొద్ది మోతాదులో తీసుకోగానే కడుపు నిండిన భావన కలుగుతుంది.ఇంకా చీజ్ ను తీసుకోవడం వల్ల త్వరగా ఆకలి వేయకుండా ఉంటుంది. అందువల్ల మనం ఇతర ఆహారాలను తక్కువగా తీసుకుంటాము.ఇంకా అలాగే కొన్ని రకాల చీజ్ లు ప్రోబయాటిక్స్ ను ఎక్కువగా కలిగి ఉంటాయి. ఇవి పొట్ట ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇంకా జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేయడంలో దోహదపడతాయి. ఈ విధంగా చీజ్ మన ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని దీనిని తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.కాబట్టి ఖచ్చితంగా చీజ్ ని తినండి. అనేక ఆరోగ్య ప్రయోజనాలని పొందండి.

# ప్రేమికుడి స్నేహితుడితో శృంగారానికి నిరాకరించినందుకు

## బాలిక దారుణ హత్య: అర్ధరాత్రి పిలిపించి..

**మన దునియా,ఉత్తరప్రదేశ్, మీర్జాపూర్,పడ్రి:మే 26**

ఉత్తరప్రదేశ్ లోని మీర్జాపూర్, పడ్రి ప్రాంతంలో 15 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసి, ఆపై దారుణంగా హత్య చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాలిక శరీరంపై ముక్కు, పెదవులు మరియు మెడ భాగాల్లో తీవ్రమైన గాయాలు ఉండటంతో, నిందితులు ఆమెను ఎంతటి పాశవికంగా హతమార్చారో స్పష్టమవుతోంది.

ఈ ఘటనలో ప్రేమికుడితో పాటు అతని స్నేహితుడిని కూడా పోలీసులు అరెస్టు చేశారు

ఏం జరిగింది? బాలిక తన వదినతో కలిసి శనివారం రాత్రి పడుకుంది. అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఆమె అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు రాత్రంతా వెతికినా ఫలితం లేకపోయింది. ఆదివారం ఉదయం ఇంటికి 200 మీటర్ల దూరంలో ఉన్న పొడి కాలువలో ఆమె మృతదేహం కనిపించింది. ఆ బాలికను సుఖనై గ్రామానికి చెందిన సాజన్ (ప్రేమికుడు) మరియు అజయ్ కలిసి హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు.హత్యకు కారణం: ఎస్పీ అపర్ణ రజత్ కౌశిక్ తెలిపిన వివరాల ప్రకారం, సాజన్ బాలికను రాత్రిపూట బయటకు పిలిపించాడు. ఒంటరి ప్రదేశానికి తీసుకెళ్లి సాజన్ ముందుగా ఆమెపై అత్యాచారం చేశాడు. ఆ తర్వాత తన స్నేహితుడైన అజయ్ కూడా శృంగారంలో పాల్గొనాలని బాలికపై ఒత్తిడి తెచ్చాడు. బాలిక తీవ్రంగా ప్రతిఘటించడంతో, ఆగ్రహానికి గురైన ఇద్దరు నిందితులు ఆమెను కొట్టి, గొంతు నులిమి హత్య చేశారు.ఎన్ కౌంటర్ మరియు అరెస్టు: ప్రధాన నిందితుడు సాజన్ను పోలీసులు అతని ఇంట్లోనే అరెస్టు చేశారు. విచారణలో అతను అజయ్ పేరును వెల్లడించాడు. అజయ్ను పట్టుకునే క్రమంలో



పోలీసులపై అతను కాల్పులు జరిపాడు. పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో అజయ్ ఎడమ కాలికి బుల్లెట్ తగలడంతో అతను గాయపడ్డాడు. ప్రస్తుతం అతను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

కుటుంబంలో విషాదం: నలుగురు పిల్లల్లో ఆ బాలికే చిన్నది.

ఆమె తండ్రి ఆర్కెస్ట్రా నిర్వాహకుడు. శనివారం రాత్రి ఆయన ఒక కార్యక్రమం కోసం వేరే గ్రామానికి వెళ్లగా, ఈ దారుణం జరిగింది. కుమార్తె మృతదేహాన్ని చూడగానే తల్లి స్పృహ తప్పి పడిపోయింది. నిందితుడిని గతంలోనే తాము హెచ్చరించామని, అయినా అతను వినకుండా తమ బిడ్డను పొట్టనబెట్టుకున్నాడని తల్లి విలపిస్తోంది. ఈ ఘటనపై పోలీసులు అత్యాచారం మరియు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.


# వాజేడు మండల కేంద్రంలోని ప్రభుత్వం మంజూరు చేసిన వైన్ షాపు నందు

## నిబంధనలకు విరుద్ధంగా అధిక రేటుకు అమ్ముతున్న వైన్ షాప్







**మన దునియా, వాజేడు, మే 26**



ములుగు జిల్లా వాజేడు మండలం వాజేడు గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన వైన్ షాప్ నందు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్నారు వైన్స్ షాపులో ధరల పట్టిక నిర్మించకుండా అధిక ధరలతో నిలువు దోపిడీ చేస్తున్నారు టెండర్ హోల్డర్ లేకుండానే బినామీ వ్యక్తులు ద్వారా అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్నారు ఇట్టి విషయాన్ని తెలియజేయుటకు వాజేడు గ్రామ పరిధిలోని పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్‌కు గ్రామ ప్రజలతో కలిసి దరఖాస్తు ఇవ్వడం జరిగింది దీనిపై వెంటనే చర్య తీసుకోవాలని కోరినారు అదేవిధంగా మండల కేంద్రంలోని ఎమ్మార్వో గారికి దరఖాస్తు ఇవ్వడం జరిగింది కావున దీనిపై తగిన చర్య తీసుకోవాలని గ్రామ ప్రజలు తెలియజేశారు ఈ సందర్భంగా నూగురూ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ చైర్మన్ పూణెం రాంబాబు దెబ్బకట్ల లక్ష్మయ్య బి కృష్ణబాబు టి వెంకటేశ్వర్లు టీ నాన బాబు టి సేసయ్య పి రవీందర్ టి సతీష్ పి నాగరాజు తల్లడి రత్తయ్య పూణెం రామ్మూర్తి పి సారయ్య అందరూ కలిసి ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మద్యం అమ్మాలని మద్యం షాపు దగ్గర ధరల పట్టిక స్పష్టంగా ఏర్పాటు చేయాలని బినామీలకు తావియ్యకుండా మద్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మాలని వాజేడు మండల లోని ప్రజలు దీనిపై ఎమ్మార్వోకి మరియు పీఎస్ పరిధిలోని సబ్ ఇన్స్పెక్టర్ గారికి ప్రభుత్వం ధరలకే మద్యాన్ని అమ్మేటట్టుగా చర్యలు తీసుకోవాలని కోరినారు



# మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే



శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగినప్పుడు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యలు ముఖ్యంగా ఆర్థరైటిస్, కిడ్నీ సంబంధిత వ్యాధుల రూపంలో కనిపిస్తాయి. అధిక యూరిక్ యాసిడ్ కారణంగా జాయింట్లలో నొప్పులు, వాపులు మొదలవుతాయి. గ్రీన్ కలర్ ఫుడ్స్ దినచర్యలో భాగం చేస్తే ఈ సమస్యను సహజంగా నివారించవచ్చు. పాలకూరలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇందులో ఉన్న మెగ్నీషియం శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. పాలకూరను రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి పుష్కలమైన పోషకాలు అందించడమే కాక.. ఆరోగ్యాన్ని కాపాడేందుకు సహాయపడుతుంది.పచ్చి బఠానీలలో ఫైబర్ అధికంగా ఉంటుంది.. ఇది శరీరానికి కావలసిన శక్తిని అందిస్తుంది. వీటిలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని డిటాక్స్ చేయడంలో తోడ్పడతాయి. గౌట్ వంటి సమస్యలను తగ్గించడానికి ఈ బీన్స్ చాలా ఉపయోగపడతాయి.గ్రీన్ టీ శరీరంలోని హానికరమైన వ్యర్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఈ టీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఆహ్లాదకరమైన రుచి యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో తోడ్పడతాయి. ప్రతిరోజూ ఒక కప్పు గ్రీన్ టీ తాగడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చు. సెలరీలో ఉన్న పోషకాలు మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తాయి. ఇది శరీరంలోని వాపును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ఈ ఆకుకూర సహాయపడుతుంది. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ఈ పండు శరీరానికి అవసరమైన ఎనర్జీ అందించే ప్రక్రియను మెరుగుపరుస్తుంది. ఇది శరీరంలోని వ్యర్థ పదార్థాలను వెలుపలికి పంపడంలో సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని తగ్గించడానికి అవకాడో ఉపయోగపడుతుంది. ఆస్పరాగస్‌లో ఫైబర్, ప్యూరిన్లు సమతుల్యంగా ఉంటాయి. ఇది శరీరంలోని హానికరమైన పదార్థాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కాబట్టి ఆస్పరాగస్ ను తగిన మోతాదులో తీసుకోవడం మంచిది.గ్రీన్ బీన్స్ లో ప్యూరిన్లు తక్కువగా ఉంటాయి.. అందుకే ఇవి యూరిక్ యాసిడ్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి.

# ఐపీఎల్-2026 ఫైనల్లోకి దూసుకెళ్లిన ఆర్సీబీ... గుజరాత్ కు మరో చాన్స్

**క్వాలిఫయర్-1లో గుజరాత్‌పై ఆర్సీబీ 92 పరుగుల భారీ విజయం**

**ఐపీఎల్ 2026 ఫైనల్‌కు నేరుగా అర్హత సాధించిన బెంగళూరు**

**33 బంతుల్లో 93 పరుగులు చేసి కెప్టెన్ రజత్ పటీదార్ విధ్వంసం**

**గుజరాత్ తరపున రాహుల్ తెవాటియా ఒంటరి పోరాటం**

**ఓడినా గుజరాత్ టైటాన్స్‌కు ఫైనల్ చేరేందుకు మరో అవకాశం**



డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఐపీఎల్ 2026 సీజన్‌లో నేరుగా ఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన క్వాలిఫయర్-1 మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌ను 92 పరుగుల భారీ తేడాతో చిత్తుగా ఓడించి టైటిల్ సమరానికి సిద్ధమైంది. కెప్టెన్ రజత్ పటీదార్ ఆడిన విధ్వంసకర ఇన్నింగ్స్ ఆర్సీబీ విజయంలో కీలకపాత్ర పోషించింది. మరోవైపు, ఈ మ్యాచ్‌లో ఓటమి పాలైనప్పటికీ గుజరాత్ టైటాన్స్‌కు ఫైనల్ చేరేందుకు మరో అవకాశం మిగిలి ఉంది. ఎలిమినేటర్ మ్యాచ్ విజేతతో ఆ జట్టు క్వాలిఫయర్-2లో తలపడనుంది. ధర్మశాల వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన గుజరాత్ టైటాన్స్ బౌలింగ్ ఎంచుకోగా, ఆర్సీబీ బ్యాటర్లు పరుగుల వరద పారించారు. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 254 పరుగుల భారీ స్కోరు సాధించారు. వెంకటేశ్ అయ్యర్ (19) మెరుపు ఆరంభాన్ని ఇవ్వగా, విరాట్ కోహ్లీ (43), దేవదత్ పడిక్కల్ (30) కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే వీరిద్దరిని ఒకే ఓవర్లో పెవిలియన్ చేర్చి హోల్డర్ గుజరాత్‌కు కాస్త ఊరటనిచ్చాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ రజత్ పాటిదార్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 33 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్సర్లతో అజేయంగా 93 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. కృనాల్ పాండ్య (43) కూడా రాణించడంతో ఆర్సీబీ భారీ స్కోరు చేసింది. అనంతరం 255 పరుగుల కొండంత లక్ష్య ఛేదనలో గుజరాత్ టైటాన్స్ ఆరంభంలోనే తడబడింది. సాయి సుదర్శన్ (14), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (2) త్వరగా ఔటయ్యారు. జోస్ బట్లర్ (29) వేగంగా ఆడే ప్రయత్నం చేసినా ఎక్కువసేపు నిలవలేదు. ఒక దశలో 51 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి గుజరాత్ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ సమయంలో రాహుల్ తెవాటియా (68) ఒంటరి పోరాటం చేశాడు. 43 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో గుజరాత్ పరువు నిలిపే ప్రయత్నం చేశాడు. కానీ అతనికి ఇతర బ్యాటర్ల నుంచి సహకారం అందలేదు. ఆర్సీబీ బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో గుజరాత్ 19.3 ఓవర్లలో 162 పరుగులకే ఆలౌట్ అయింది. ఆర్సీబీ బౌలర్లలో జాకబ్ డఫీ 3 వికెట్లు పడగొట్టగా.. భువనేశ్వర్ కుమార్, కృనాల్ పాండ్య, రసిఖ్ సలామ్ దార్ తలా రెండు వికెట్లు తీశారు. రేపు (మే 27) సన్ రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ జరగనుంది. ఇందులో గెలిచిన జట్టుతో మే 29న క్వాలిఫయర్-2లో గుజరాత్ టైటాన్స్ తలపడనుంది. ఈ మ్యాచ్ లో గెలిచిన జట్టు ఫైనల్ చేరుతుంది.

# గుజరాత్ బౌలర్లకు చుక్కలు చూపించిన పటీదార్... క్వాలిఫయర్-1లో ఆర్సీబీ భారీ స్కోరు

**క్వాలిఫయర్-1లో ఆర్సీబీ పరుగుల వరద**

**20 ఓవర్లలో 5 వికెట్లకు 254 పరుగులు**

**కెప్టెన్ రజత్ పటీదార్ విధ్వంసకర బ్యాటింగ్**

**కేవలం 33 బంతుల్లో 9 సిక్సర్లతో 93 పరుగులు**

**గుజరాత్ టైటాన్స్ ముందు 255 పరుగుల కొండంత లక్ష్యం**

**విరాట్ కోహ్లీ, కృనాల్ పాండ్యా కీలక ఇన్నింగ్స్‌లు**

ఐపీఎల్ 2026 సీజన్‌లో అత్యంత కీలకమైన క్వాలిఫయర్-1 మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్ రజత్ పటీదార్ తన విశ్వరూపం ప్రదర్శించాడు. కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో ఆకాశమే హద్దుగా చెలరేగి గుజరాత్ టైటాన్స్ బౌలింగ్‌ను తుత్తునియలుచేశాడు. కేవలం 33 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్సర్లతో అజేయంగా 93 పరుగులు సాధించడంతో ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 254 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఫైనల్ బెర్త్ కోసం బరిలోకి దిగిన గుజరాత్ ముందు కొండంత లక్ష్యాన్ని నిర్దేశించింది. ధర్మశాలలోని హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన గుజరాత్ టైటాన్స్ బౌలింగ్ ఎంచుకుంది. వారి నిర్ణయం సరైంది కాదని నిరూపిస్తూ ఆర్సీబీ బ్యాటర్లు ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించారు. ఓపెనర్ వెంకటేశ్ అయ్యర్ (7 బంతుల్లో 19) మెరుపు ఆరంభాన్ని ఇచ్చినా, రెండో ఓవర్‌లోనే ఔటయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లీ (25 బంతుల్లో 43), దేవదూత్ పడిక్కల్ (19 బంతుల్లో 30)తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 72 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే, హోల్డర్ వేసిన తొమ్మిదో ఓవర్‌లో కోహ్లీ, పడిక్కల్ వెంటవెంటనే ఔట్ కావడంతో ఆర్సీబీ స్కోరు వేగం తగ్గినట్లు కనిపించింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ రజత్ పటీదార్ మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. గుజరాత్ బౌలర్లపై ఎదురుదాడికి దిగి బౌండరీలు, సిక్సర్లతో హోరెత్తించాడు. ఒకవైపు కృనాల్ పాండ్యా (28 బంతుల్లో 43) అతనికి చక్కటి సహకారం అందించగా, మరోవైపు పటీదార్ తనదైన శైలిలో విధ్వంసం సృష్టించాడు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు కేవలం 45 బంతుల్లోనే 95 పరుగులు జోడించారు. ముఖ్యంగా రషీద్ ఖాన్, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్‌లో భారీ షాట్లు ఆడి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. 281.82 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసిన పటీదార్, కేవలం 7 పరుగుల తేడాతో సెంచరీ చేజార్చుకున్నా.. జట్టుకు భారీ స్కోరు అందించడంలో కీలక పాత్ర పోషించాడు. చివరిలో జితేశ్ శర్మ (5 బంతుల్లో 15) కూడా మెరుపులు మెరిపించడంతో ఆర్సీబీ 250 పరుగుల మార్కును దాటింది. గుజరాత్ బౌలర్లలో జాసన్ హోల్డర్, కగిసో రబాడ చెరో రెండు వికెట్లు పడగొట్టినా, భారీగా పరుగులు సమర్పించుకున్నారు. ఈ మెగా టార్గెట్‌ను ఛేదించి గుజరాత్ ఫైనల్‌కు చేరుకుంటుందో లేదో వేచి చూడాలి.



# భారత్‌తో పోరుకు ఆఫ్ఘనిస్థాన్ సై.. టెస్టు, వన్డే సిరీస్ లకు వేర్వేరు జట్ల ప్రకటన



భారత్ పర్యటన కోసం ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) సోమవారం జట్లను ప్రకటించింది. ఈ పర్యటనలో భాగంగా ఒక టెస్టు మ్యాచ్, మూడు వన్డేల సిరీస్ జరగనుండగా, ఈ రెండు ఫార్మాట్లకు ఆల్‌రౌండర్ హష్మతుల్లా షాహిదినే కెప్టెన్‌గా కొనసాగిస్తున్నట్లు ఏసీబీ స్పష్టం చేసింది. ఇందుకోసం 15 మంది సభ్యులతో కూడిన వేర్వేరు జట్లను ఎంపిక చేసింది. స్టార్ ఆటగాళ్లు రషీద్ ఖాన్, రహ్మానుల్లా గుర్బాజ్, మహ్మద్ నబీ, అజ్మతుల్లా ఒమర్‌జాయ్ వంటి కీలక ఆటగాళ్లకు ఈ జట్లలో చోటు కల్పించారు. వన్డే జట్టును పరిశీలిస్తే, అనుభవజ్ఞులైన ఆటగాళ్లకే ఏసీబీ పెద్దపీట వేసింది. రహ్మానుల్లా గుర్బాజ్, ఇబ్రహీం జద్రాన్ ఓపెనర్లుగా బరిలోకి దిగే అవకాశం ఉంది. మిడిల్ ఆర్డర్‌లో కెప్టెన్ షాహిది, రహ్మత్ షా, దర్విష్ రసూలి జట్టుకు స్థిరత్వం చేకూర్చనున్నారు. ఆల్‌రౌండర్లు మహ్మద్ నబీ, అజ్మతుల్లా ఒమర్‌జాయ్ జట్టుకు సమతూకం అందించనున్నారు. ఇక బౌలింగ్ విభాగానికి స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ నాయకత్వం వహించనుండగా, యువ స్పిన్నర్ ఏఎం గజన్ఫర్‌తో పాటు పేసర్లు బిలాల్ సమీ, ఫరీద్ మాలిక్, జియా-ఉర్-రెహ్మాన్ షరీఫీలకు స్థానం కల్పించారు. అయితే, ఏకైక టెస్టు మ్యాచ్ కోసం ప్రకటించిన జట్టులో ఏసీబీ కొన్ని ఆసక్తికర మార్పులు చేసింది. ముఖ్యంగా, స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్‌కు ఈ టెస్టు నుంచి విశ్రాంతినిచ్చింది. అతని స్థానంలో స్పిన్నర్లుగా ఖైస్ అహ్మద్, నంగ్యాల్ ఖరోటై, షరాఫుద్దీన్ అష్రఫ్‌లపై సెలక్టర్లు నమ్మకం ఉంచారు. టెస్టు జట్టులోకి అబ్దుల్ మాలిక్, రహ్మానుల్లా జద్రాన్, షరాఫుద్దీన్ అష్రఫ్ కొత్తగా రాగా, రహ్మత్ షా, గుర్బాజ్ వంటి సీనియర్లు తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. వికెట్ కీపర్లుగా ఇక్రమ్ అలీఖిల్, అఫ్సర్ జజాయ్‌లను ఎంపిక చేశారు.

సిరీస్ షెడ్యూల్ వివరాలు

భారత్ లో ఆఫ్ఘనిస్థాన్ పర్యటన ఏకైక టెస్టు మ్యాచ్‌తో ప్రారంభమవుతుంది. ఈ మ్యాచ్ జూన్ 6 నుంచి 10 వరకు న్యూ చండీగఢ్‌లో జరుగుతుంది. అనంతరం మూడు వన్డేల సిరీస్ ప్రారంభమవుతుంది. తొలి వన్డే జూన్ 13న ధర్మశాలలో, రెండో వన్డే జూన్ 17న లక్నోలో, చివరిదైన మూడో వన్డే జూన్ 20న చెన్నైలో జరగనున్నాయి.

ఆఫ్ఘనిస్థాన్ వన్డే జట్టు:

హష్మతుల్లా షాహిది (కెప్టెన్), రహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), ఇబ్రహీం జద్రాన్, సెదికుల్లా అటల్, దర్విష్ రసూలి, రహ్మత్ షా, ఇక్రమ్ అలీఖిల్ (వికెట్ కీపర్), మహ్మద్ నబీ, అజ్మతుల్లా ఒమర్‌జాయ్, రషీద్ ఖాన్, నంగ్యాల్ ఖరోటై, ఏఎం గజన్ఫర్, జియా-ఉర్-రెహ్మాన్ షరీఫీ, ఫరీద్ మాలిక్, బిలాల్ సమీ.

రిజర్వ్ ఆటగాళ్లు: ఖైస్ అహ్మద్, సలీమ్ సఫీ, బషీర్ అహ్మద్.

ఆఫ్ఘనిస్థాన్ టెస్ట్ జట్టు:

హష్మతుల్లా షాహిది (కెప్టెన్), అబ్దుల్ మాలిక్, సెదికుల్లా అటల్, రహ్మత్ షా, రహ్మానుల్లా గుర్బాజ్, రహ్మానుల్లా జద్రాన్, అఫ్సర్ జజాయ్ (వికెట్ కీపర్), ఇక్రమ్ అలీఖిల్ (వికెట్ కీపర్), అజ్మతుల్లా ఒమర్‌జాయ్, షరాఫుద్దీన్ అష్రఫ్, నంగ్యాల్ ఖరోటై, ఖైస్ అహ్మద్, బిలాల్ సమీ, జియా షరీఫీ, సలీమ్ సఫీ. రిజర్వ్ ఆటగాళ్లు: బషీర్ అహ్మద్, బహిర్ షా, ఇస్మత్ ఆలం.

## ఆర్సీబీపై టాస్ గెలిచిన గుజరాత్.. ఫైనల్ బెర్త్‌పై ఇరు జట్ల గురి

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో అత్యంత కీలకమైన క్వాలిఫయర్-1 మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. ధర్మశాలలోని హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ జట్లు తలపడుతున్నాయి. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ముందుగా ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. దీంతో ఆర్సీబీ తొలుత బ్యాటింగ్ చేయనుంది. టాస్ గెలిచిన అనంతరం శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ.. "ఈ పిచ్‌పై రెండో ఇన్నింగ్స్‌లో మంచు ప్రభావం ఉంటుంది. అందుకే లక్ష్య ఛేదనకు మొగ్గు చూపుతున్నాం. మేం అద్భుతమైన క్రికెట్ ఆడుతున్నాం, ఇదే జోరు కొనసాగిస్తాం. ఈ మైదానంలో నేను అండర్-14, అండర్-16 రోజుల్లో చాలా మ్యాచ్‌లు ఆడాను" అని తెలిపాడు. తుది జట్టులో ఒక మార్పు చేసినట్లు, అర్షద్ ఖాన్ స్థానంలో కుల్వంత్ ఖేజ్రోలియా ఆడుతున్నట్లు గిల్ వివరించాడు. మరోవైపు, ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ మాట్లాడుతూ.. "పిచ్ బ్యాటింగ్‌కు చాలా బాగుంది. 40 ఓవర్ల పాటు పిచ్‌లో మార్పు ఉండదు. అందుకే బోర్డుపై భారీ స్కోరు ఉంచి, గుజరాత్‌ను ఒత్తిడిలోకి నెట్టాలని భావిస్తున్నాం. ప్రత్యర్థి గురించి కాకుండా మా బలాబలాలపైనే దృష్టి సారించాం" అని ధీమా వ్యక్తం చేశాడు. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌లోకి ప్రవేశిస్తుంది. ఓడిన జట్టుకు ఫైనల్ చేరేందుకు మరో అవకాశం ఉంటుంది. ఎలిమినేటర్ మ్యాచ్ విజేతతో క్వాలిఫయర్-2లో తలపడాల్సి ఉంటుంది.

తుది జట్లు:

గుజరాత్ టైటాన్స్: సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్(కెప్టెన్), జోస్ బట్లర్(వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, నిశాంత్ సింధు, జాసన్ హోల్డర్, రషీద్ ఖాన్, కుల్వంత్ ఖేజ్రోలియా, కగిసో రబడ, మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు: వెంకటేష్ అయ్యర్, విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్, రజత్ పాటిదార్(కెప్టెన్), జితేష్ శర్మ(వికెట్ కీపర్), టిమ్ డేవిడ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, జాకబ్ డఫీ, జోష్ హేజిల్‌వుడ్, రసిఖ్ సలామ్ దార్.

ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్స్:



గుజరాత్ టైటాన్స్: రాహుల్ తెవాటియా, గ్లెన్ ఫిలిప్స్, అనూజ్ రావత్, కుమార్ కుశాగ్ర, సాయి కిషోర్. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు: రొమారియో షెపర్డ్, సుయాష్ శర్మ, కనిష్క్ చౌహాన్, అభినందన్ సింగ్, జోర్డాన్ కాక్స్.

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## ముమైత్ ఖాన్ కు పాకిస్థాన్ తో సంబంధం ఏమిటి? ఇప్పుడు ఏం చేస్తోంది?



‘ఇప్పటికింకా నా వయసు నిండా పదహారే’ అనగానే టక్కున గుర్తొచ్చే ముమైత్ ఖాన్... ఆ ఒక్క పాటతో తెలుగు చిత్ర పరిశ్రమలో ఓవర్ నైట్ స్టార్‌గా మారి, ఐదారేళ్ల పాటు టాలీవుడ్‌ను ఊపేసింది. అప్పట్లో స్టార్ హీరోల సినిమాల్లో ముమైత్ ఖాన్ ఐటమ్ సాంగ్ ఉండాల్సిందే అనేత రేంజ్ లో ఆమె క్రేజ్ సంపాదించుకుంది. అయితే, కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడే ఒక్కసారిగా మాయమైపోయిన ముమైత్ అసలేమైపోయింది? ఆమెకు పాకిస్థాన్‌తో ఉన్న సంబంధం ఏంటి? అన్న ఆసక్తికర వివరాలను ఇప్పుడు చూద్దాం.ముమైత్ ఖాన్ పుట్టి పెరిగిందంతా ముంబైలోనే అయినప్పటికీ, ఆమె కుటుంబానికి అంతర్జాతీయ నేపథ్యం ఉంది. ఆమె తల్లిది తమిళనాడు కాగా, తండ్రిది పాకిస్థాన్. ముమైత్ పుట్టిన తర్వాతే వారి కుటుంబం ముంబైకి షిఫ్ట్ అయింది. చిన్నతనంలోనే తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు, ఆకలి కష్టాలు అనుభవించిన ముమైత్... కేవలం 13 ఏళ్ల వయసు నుంచే పని చేయడం ప్రారంభించింది.సినిమాల్లోకి రాకముందు ఆమె అసలు పేరు ముంతాజ్. ఇండస్ట్రీలోకి వచ్చాక ‘ముమైత్ ఖాన్’గా మార్చుకుంది. తమిళ చిత్రం ‘మజ్నూ’తో కెరీర్ ప్రారంభించి, తెలుగులో ‘స్వామి’ సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత ఛత్రపతి, యోగి, మగధీర వంటి ఎన్నో చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్‌తో పాటు ‘మైసమ్మ ఐపీఎస్’ లాంటి లేడీ ఓరియెంటెడ్ సినిమాల్లోనూ నటించింది.సినిమాల్లో బిజీగా ఉన్న సమయంలోనే ఆమె జీవితాన్ని మార్చేసిన ఒక ఘోర ప్రమాదం జరిగింది. ఒకానొక సందర్భంలో ముమైత్ దీనిపై స్పందిస్తూ... తాను కావాలని సినిమాలు మానేయలేదని, ప్రమాదవశాత్తు తన మెదడులోని 5 నరాలు చిట్లిపోయాయని వెల్లడించింది. ఈ యాక్సిడెంట్ తర్వాత ఆమె ఏకంగా 15 రోజుల పాటు కోమాలోకి వెళ్లిపోయింది. కోమా నుంచి కోలుకున్నాక కనీసం ఏడేళ్ల పాటు ఎలాంటి పనులు చేయకూడదని, చిన్న వస్తువు కూడా ఎత్తకూడదని డాక్టర్లు కఠినమైన ఆంక్షలు విధించారు. ఆ ఏడేళ్ల విరామంలో ఆమె తల్లి దగ్గరుండి చూసుకుంది. “దేవుడే నన్ను ముమైత్ ఖాన్‌గా మార్చాడు, ఆయనే నా కెరీర్‌కు ఫుల్‌స్టాప్ పెట్టమని హింట్ ఇచ్చాడు, దాన్ని నేను అంగీకరించాను” అని ముమైత్ గతంలో పేర్కొంది.సినిమాలకు దూరమైన ఆ ఏడేళ్ల కాలంలోనే ముమైత్ ఒక కొత్త ఆలోచనతో వ్యాపార రంగంలోకి అడుగుపెట్టింది. తను నటిగా బిజీగా ఉన్నప్పుడు హెయిర్ స్టైలింగ్, మేకప్ కిట్స్, స్టైలింగ్ టీమ్స్‌ను ముంబై నుంచి హైదరాబాద్‌కు రప్పించాల్సి వచ్చేదని... అదే సేవలను హైదరాబాద్‌లోనే ఎందుకు అందుబాటులోకి తీసుకురాకూడదనే ఉద్దేశంతో ఒక బిజినెస్ స్టార్ట్ చేసింది. ప్రస్తుతం దాన్నే తన పూర్తిస్థాయి కెరీర్‌గా ఎంచుకుంది.మధ్యలో బిగ్‌బాస్ తెలుగు మొదటి సీజన్‌లో పాల్గొన్నప్పటికీ... అప్పట్లో సంచలనం సృష్టించిన డ్రగ్స్ కేసు విచారణ నిమిత్తం షో మధ్యలో నుంచి బయటకు వచ్చి, మళ్లీ వెళ్లాల్సి వచ్చింది. ఆ తర్వాత 49వ రోజు షో నుండి ఎలిమినేట్ అయింది. ప్రస్తుతం కొత్త ప్రాజెక్టులు ఏవీ చేయకుండా, కేవలం సోషల్ మీడియాలో అడపాదడపా వీడియోలు చేస్తూ తన వ్యక్తిగత, వ్యాపార జీవితాన్ని కొనసాగిస్తోంది.

## రామ్ చరణ్ ‘పెద్ది’ నుంచి లేటెస్ట్ అప్డేట్.. డబ్బింగ్ పూర్తి చేసిన జగ్గూభాయ్

**‘పెద్ది’ లో అప్పలసూరి అనే కీలక పాత్రలో నటిస్తున్న జగపతి బాబు**

**జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల**

**ఇప్పటికే విడుదలైన మూవీ ట్రైలర్‌కు మంచి స్పందన**



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం ‘పెద్ది’. ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి ఒక ముఖ్యమైన అప్‌డేట్ వెలువడింది. ఈ సినిమాలో అప్పలసూరి అనే కీలక పాత్ర పోషిస్తున్న ప్రముఖ నటుడు జగపతి బాబు తన పాత్రకు సంబంధించిన డబ్బింగ్ పూర్తి చేశారు.ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ వృద్ధి సినిమాస్ తమ ‘ఎక్స్’ (ట్విట్టర్) ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించింది. “మా జగపతి బాబు గారు అప్పలసూరిగా మారడం చూడండి. ‘పెద్ది’ కోసం ఆయన తన డబ్బింగ్ పూర్తి చేశారు. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వస్తున్నాం” అంటూ పోస్ట్ చేసింది.గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ డ్రామాపై మొదటి నుంచి భారీ ఆసక్తి ఉంది. ఇటీవల విడుదలైన ట్రైలర్ ఈ అంచనాలను మరింతగా పెంచింది. క్రీడలు, భావోద్వేగాల కలబోతగా ఉన్న ఈ ట్రైలర్‌లో రామ్ చరణ్ ఒక బహుముఖ క్రీడాకారుడిగా కనిపించారు. క్రికెట్, రెజ్లింగ్ వంటి క్రీడల్లో రాణిస్తూ, పల్లెటూరిలో అందరి అభిమానం సంపాదించుకునే యువకుడిగా ఆయన పాత్ర ఆకట్టుకుంది. జాన్వీ కపూర్ కథానాయికగా నటించగా, శివ రాజ్‌కుమార్, దివ్యేందు, బోమన్ ఇరానీ వంటి ప్రముఖులు ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు. జూన్ 4న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.



# ‘పెద్ది’ ప్రమోషన్స్... ‘దేశీ ప్రిన్సెస్’లా మెరిసిపోయిన జాన్వీ!

**పెద్ది’ సినిమా ప్రమోషన్లలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన జాన్వీ**

**సాంప్రదాయ బెనారసీ చీరకు బదులుగా స్ట్రాప్‌లెస్ గౌను ధరించిన నటి**

**పాస్టెల్ రంగులు, పూల డిజైన్లతో కూడిన గౌనులో అద్భుతమైన లుక్**

**సంప్రదాయానికి ఆధునికత జోడించి ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకున్న జాన్వీ**

బాలీవుడ్ యువ నటి జాన్వీ కపూర్ తన ఫ్యాషన్ సెన్స్‌తో మరోసారి అందరినీ ఆశ్చర్యపరిచారు. బెంగళూరులో తన తాజా చిత్రం ‘పెద్ది’ ప్రమోషన్లలో భాగంగా ఆమె ధరించిన ఒక ప్రత్యేకమైన డ్రెస్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. సాంప్రదాయ బెనారసీ వస్త్రానికి ఆధునిక హంగులు జోడించి రూపొందించిన గౌనులో జాన్వీ అచ్చం ‘దేశీ ప్రిన్సెస్’ (భారతీయ యువరాణి)లా మెరిసిపోయారు.సాధారణంగా బెనారసీ అంటే చీరనే గుర్తుకువస్తుంది. కానీ, జాన్వీ దానికి భిన్నంగా స్ట్రాప్‌లెస్ గౌనును ఎంచుకున్నారు. కార్సెట్ తరహా బాడీస్‌తో, ఫిట్‌గా ఉండే ఈ గౌను ఆమె అందాన్ని మరింత పెంచింది. లేత గులాబీ, మింట్, ఐవరీ వంటి పాస్టెల్ రంగుల కలయిక, బంగారు వర్ణంతో నేసిన పూల డిజైన్లు ఈ డ్రెస్‌కు ప్రత్యేక ఆకర్షణను తెచ్చిపెట్టాయి. దీనికి జతగా చేతులపై కప్పుకున్న షీర్ పాస్టెల్ దుపట్టా రాజసమైన లుక్‌ను ఇచ్చింది.ఈ డ్రెస్‌కు తగ్గట్టుగా ఆక్సీడైజ్డ్ సిల్వర్ జుంకాలు, స్టేట్‌మెంట్ ఇయర్ కఫ్ వంటి మినిమల్ యాక్సెసరీస్ ధరించారు. నుదుట పాపిడితో వేసిన స్లీక్ బన్, గ్లోయీ మేకప్‌తో తన లుక్‌ను పూర్తిచేశారు. ఇటీవలే పర్పుల్ లెహంగాతో వైరల్ అయిన జాన్వీ, ఇప్పుడు ఈ బెనారసీ గౌనుతో సంప్రదాయ వస్త్రకళకు, ఆధునిక ఫ్యాషన్‌కు మధ్య అద్భుతమైన బ్యాలెన్స్ ఎలా సాధించవచ్చో నిరూపించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cell No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com